సమస్యలతో సహవాసం

- ఏళ్ల తరబడి పూరిగుడిసెల్లోనే తరగతులు
- ప్రభుత్వ పాఠశాల భవనం కోసం ఎదురుచూపులు
- కానరాన కనీస మౌలిక సదుపాయాలు
- విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



పెదవంచరంగిలో ప్రభుత్వ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



జర్సింగిలో పాకలోనే బోధనలు

పెదబయలు: సర్కారు బడి అంటే తప్పనిసరిగా భవనం, ఆట స్థలం, మరుగుదొడ్లు మంచి ఆహ్లాద కర వాతావరణం కల్పించి విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉంది. అయితే ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో ఇందుకు పూర్తి వ్యతిరేకంగా ఉంది. రాష్ట్రం ప్రగతి పథంలో పరుగులు పెడుతోం దని, విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తున్నామని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఎక్కడా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. కంప్యూటర్ యుగంలో పరుగులు పెడుతున్నామని అన్నది మోసమే అవుతుంది. పెదబయలు మండలంలో చిన్నారులకు సరైన విద్య అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. మండలంలోని 14 పాఠ శాలలు పెదకొండ, జర్సింగి, జంగంపుట్టు, గండ లం, చీడిపుట్టు, జమదంగి, పెదవంచరంగి, బాసుల, తల్లాబు, గజ్జెడి, సాలెబులు, కోంద్రుం, మూలగరువు, రెంజలమామిడి పాఠశాలకు పాఠ శాల భవనాలు లేక పాకల్లోనే చదువులు సాగి స్తున్నారు. విద్యార్థులకు బోధించడానికి ఎలాంటి సదుపాయాలు లేకుండా తరగతులు జరుగు తున్నాయి. వర్షం పడితే పాక నుంచి నీరు కారుతున్న పాకలోనే గడపాల్సిన పరిస్థితితో విద్యా ర్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. గ్రామ ప్రాథమిక పాకలో నిర్వహణ వల్ల విద్యా ర్థులు బడికి దూరం అయ్యి డ్రాపౌట్స్‌గా మారు తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు ద్వారా చాలా పాఠశాలలు అభివృద్ధి చెందాయి. కొత్త భవనాలు, పాఠశాలలకు మరమ్మ తులకు నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఇందులో భాగంగా మండలంలోని పలు పాఠశాలలు బాగుప డ్డాయి. మిగిలిన పాఠశాలలన్నింటి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశారు.. కొన్నింటికి మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులన్నీ నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైబడినా ఏజెన్సీలో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. గిరిజన విద్యపై కూటమి ప్రభుత్వం కనీసం పట్టిం చుకోవడం లేదు. దీంతో పాకల్లోనే కనీస వసతులు లేని దుస్థితిలో గిరిజన విద్యార్థులు చదవులు సాగి స్తున్నారు. కనీస రక్షణ లేని పాఠశాలల్లో తమ పిల్లలు చదువుతున్నారని, అరకొరగానే బోధన జరుగుతుందని వారి విద్యా భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పాఠశాలలకు భవనాలు నిర్మించి, మెరుగైన వసతులు కల్పించి, విద్యాభివృద్ధికి కృషి చేయాలన వారు కోరుతున్నారు.

సమస్యలతో సతమతం

పాకల్లో తరగతుల నిర్వహణతో పిల్లలకు వర్షా కాలం, చలికాలంలో అవస్థలు పడుతున్నారు. ఎలాంటి రక్షణ ఉండకపోయిన గుడిసెల్లోనే చదు వులు సాగుతున్నాయి. కనీస సదుపాయాలు లేవ ని, పాములు ప్రవేశిస్తున్నాయని, విద్యార్థుల తల్లి దండ్రులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠ శాలలకు భవనాలు నిర్మించి, మౌలిక సదుపా యాలు కల్పించాలని వారు కోరతున్నారు.

పాఠశాలలకు భవనాలు లేని గ్రామాలు

గ్రామం	విద్యార్థుల సంఖ్య
పెదకొండ	22
జర్సింగి	15
చీడిపుట్టు	44
పెదవంచరంగి	14
బాసుల	17
తల్లాబు	16
గజ్జెడి	21
సాలేబులు	16
కోంద్రు	31
మూలగరువు	20
గండలం	28
జమదంగి	30

భవనాలు మంజూరు చేయాలి



గ్రామంలో పాఠశాల భవనం లేదు. పాఠశాలకు భవనం మంజూరు చేయాలని అనే కమార్లు అధికారులను నివే దించినా మంజూరు కావడం లేదు. పాఠశాల భవనం మంజూరు చేస్తామని హామీ ఇచ్చి మరిచారు. ప్రభుత్వం, ఉన్నతాధికా రులు దృష్టి సారించాలి భవనా లు మంజూరు చేయాలి.

– నాగరాజు.
విద్యార్థి తండ్రి, పెదవంచరంగి

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని 14 ప్రాథమిక పాఠశాలలకు ఎలాం టి భవనాలు లేవు. పాకల్లోనే పాఠశాలలు నిర్వహణ జరుగుతోంది.విద్యార్థుల తల్లితండ్రుల సహకారంతోనే పాకల ఏర్పాటు జరుగుతోంది. పాఠశాల భవనాలు లేని జాబితాను కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాం. అలాగే ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకెళ్లడంతో అంచనా ఇవ్వాలని తెలి పారు. పాకల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

– జి.పుష్ప జోసెఫ్,
ఎంఈవో, పెదబయలు మండలం

క్లుప్తంగా

10న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరంలో ఈనెల 10న బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత బాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, వైఎ స్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా ఈ నెల 6న ఈ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయిం చామని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసి ఈనెల 10 మధ్యాహ్నం 2 గంటలకు నిర్వ హించాలని నిర్ణయించామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వీధిలైట్ల పంపిణీ



వీధిలైట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, పక్కన ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి: అరకు ఎంపీ గుమ్మా తనూజ రాణి నిధులతో మంజూరైన వీధిలైట్లను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సోమవారం పంపిణీ చేశారు. గూడెంకొత్తవీధిలో పర్యటనకు వచ్చిన ఆయన మండలంలో పంచాయతీల ప్రజాప్రతినిధులకు వీధిలైట్లను అందజేశారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ వీధి లైట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అరకు ఎంపీకి కృతజ్ఞతలు తెలి పారు. ఎంపీడీవో కార్యాలయం ఏవో ఇమ్మాన్యు యెల్ , ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ దేముడు, సుభద్ర పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలు

వీఆర్‌పురం; ఆదివాసి హక్కుల కోసం మను గడ కోసం ఆదివాసీ నాయకపోడు సేవ సం ఘం ఆధ్వర్యంలో జాతి మనగడకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆదివాసి నాయక పోడు అధ్యక్షుడు చిక్కాల బాలు అన్నారు. ఈ సందర్భంగా ఆయన సంఘం నాయకులతో కలిసి మండల కేంద్రంలో సోమవారం పర్య టించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న జరిగే ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించాలన్నారు. ఆదివాసీ చట్టాలు, హక్కు లను పరిరక్షించుకోవాలన్నారు. మల్లయ్య, ముత్యాలరావు, కన్నంరాజు ,సురేష్, సత్యనా రాయణ, పోశిబాబు తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



నిమ్మలపాలెంలో బాధిత కుటుంబాన్ని పరా మర్శిస్తున్న ఎంపీపీ,జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ

రంపచోడవరం: మండలంలోని నిమ్మలపాలెం లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో భార్య, బిడ్డను కోల్పోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బలిజ వీరపురెడ్డి కుటుంబాన్ని ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటల క్ష్మి, పార్టీ ఎస్టీ సెల్ కన్వీనర్ పండా రామకృ ష్ణదొర, మండల పార్టీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొరలు సోమవారం పరామర్శించారు. పార్టీ తరపున ఆ కుటుంబానికి ఆర్థిక సహా యాన్ని అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాల న్నారు. ఎంపీటీసీ సభ్యురాలు బచ్చల మం గాయమ్మ, నాయకులు బొబ్బా శేఖర్, వెంకట రెడ్డి, శ్రీనివాస్, సూర్రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి



రైతులకు మొక్కలిస్తున్న ఎమ్మెల్యే శిరీష

అడ్డతీగల: కోనలోవలో ఉద్యానశాఖ పతంజలి ఫుడ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్ర మంలో రైతులకు పామాయిల్ మొక్కలను ఎమ్మెల్యే శిరీష పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.రైతుల సుస్థి రమైన ఆర్థికాభివృద్ధికి పలు విధాలుగా సహకరి స్తామని పతంజలి సంస్థ డిప్యూటీ జనరల్ మేనే జర్ ఎ.ఎస్.ప్రకాశ్ అన్నారు. ఉద్యానశాఖ ప్రాజెక్ట్ హార్టీ కల్చర్ ఆఫీసర్ దయానంద్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజేంద్ర ప్రసాద్ రైతులకు పలు సూచనలిచ్చారు. పీఏసీ ఎస్ అధ్యక్షుడు హరిబాబు, నాయకురాలు స్వప్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు వద్దని ఆందోళన



స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ కార్యదర్శి ఎస్.బి. పోతురాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచే స్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూఆప్ చార్జీలు రద్దు చేయాలి, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించారని, అధికా రంలో వచ్చిన తర్వాత అదానీ కంపెనీకు వత్తాసు పలకడం వెనుక రహస్య ఏమిటనీ ప్రశ్నించారు. స్మాట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపు చిచ్చారు. కూటమి ప్రభుత్వం తక్షణమే ఒప్పం దాన్ని దర్దు చేసేవరకు ప్రజలందరూ వ్యతిరేకిం చాలని పిలుపునిచ్చారు. నాయకులు సురేష్‌కు మార్, సూర్యనారాయణ, సత్యనారాయణ, మహేశ్, కోటి, గుర్మిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు సదస్సులు



వరప్రసాద్

జి.మాడుగుల: మండలంలో గ్రామాల వారీగా మంగళ వారం నుంచి వ్యవసాయ రైతు సదస్సులు నిర్వహిస్తు న్నట్టు మండల వ్యవసా యశాఖ అధికారి కె.వరప్ర సాద్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మరలా 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు నెలలు పాటు సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులకు ప్రజాప్రతిని ధులు, పీసా కమిటీ సభ్యులు రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో ఎస్‌ఐ నర్సింహమూర్తి

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేటలో ఎస్‌ఐ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. కమ్యూనిటి పోలీసింగ్ కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలోని పెద్దలు, యువకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సం దర్భంగా ఎస్‌ఐ నర్సింహమూర్తి మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సారా తయారీ, అమ్మకాలు, గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, వాటి జోలికి పోవద్దన్నారు. పొలాల్లో విద్యుత్ కంచెలు ఏర్పాటుచే యవద్దని దీని వల్ల వన్యప్రాణాలతో పాటు మానవు లకు కూడా ప్రాణహని కలుగుతుందన్నారు. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసినట్టు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులతో పాటు సహపంక్తి భోజనాలు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామాల్లో తనిఖీలు



వివరాలు సేకరిస్తున్న ఆడిటర్లు

రాజవొమ్మంగి: మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవ త్సరం మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులపై ప్రస్తుతం గ్రామాల్లో తనిఖీలు జరుగుతున్నట్టు ఎంపీడీ వో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రూ. 23.5 కోట్ల విలువైన 2,324 ఉపాధి పనులు జరి గినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామాల్లో జరిగిన పనులపై ఆడిటర్లు ఆరా తీస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉపాధి పనులకు చెందిన గ్రామ సభలు మండల వ్యాప్తంగా ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అనంతరం 19న ఎం పీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ఉం టుందన్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేయాలి



జెడ్పీ సీఈవో లక్ష్మణరావుకు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

రంపచోడవరం: విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు నిర్లక్ష్యం వహించకూడదని, సిబ్బంది ప్రభుత్వం లక్ష్యం మేరకు పనిచేసి మండల అభివృ ద్ధికి సహకరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ సీఈవో వానపల్లి వి.వి.ఎస్.లక్ష్మ ణరావు అన్నారు. రంపచోడవరం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బంగారు కుటుంబాలు సమగ్ర సర్వే ,ఆధార్ లేని పిల్లల నమోదు, స్వచ్ఛాంధ్రా తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి మూడో శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏజెన్సీలో మలేరియా, డెం గ్యూ నివారణకు సిబ్బంది కృషి చేయాలన్నారు. అక్రమ కట్టడాలు, అనుమతులు లేని పర్యాటక రిసార్ట్స్ నిర్వాహకులపై నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మారేడుమిల్లి ప్రధాన టూరిస్టు కేంద్రం కానుందన్నారు. ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ కన్వీనర్ పండా రామకృ ష్ణదొర, గంగవరం జెడ్పీటీసీ బేబిరత్నం తదిత రులు సీఈవో లక్ష్మణరావు కలిసి మండలాల్లో సమస్యలు వివరించారు. సీఈవోకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వ నాథ్ తదితరులున్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

రంపచోడవరం/అడ్డతీగల: మహిళల్లో హైందవ ధర్మంపై అవగాహన కల్పించేందుకు బంగారు వర లక్ష్మి కానుక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వీహెచ్‌పీ రామసేన అధ్యక్షుడు బిజెపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. రంపచోడవరంలో సోమవారం జరిగిన బంగారు వరలక్ష్మి కానుక-3 లక్కీ డ్రా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సాంప్రదా యల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. రామసేన సం స్థ ద్వారా ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు నిర్వ హిస్తూ ఆలయాలు అభివృద్ధి, ప్రజాసేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామన్నారు. ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కలిసి నడవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డ్రాలో గెలుపొందిన 70 మం ది మహిళలకు ఉచితంగా బంగారు వరలక్ష్మి రూపులు, ధ్రువీకరణపత్రాలను అందజేశారు. నాయకులు ప్రసాద్, నానాజీ, మణిరత్నం, అచ్చా రావు, గణేష్, రామారెడ్డి పాల్గొన్నారు. అడ్డతీగలలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం



చొంపి గ్రామంలో పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పంచాయతీ కమిటి అధ్యక్షుడికి ఎన్నికైనట్లు పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ రోషిణి, తదితరులు

అరకులోయటౌన్: మండలంలోని శిరగాం పం చాయతీ కోడిపుంజువలస గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్ర మంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి, నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, మౌలిక సదుపాయాలు లేవని పలువురు గ్రామస్తులు సమస్యలను విన్నవించారు. జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి మాట్లాడుతూ సమ స్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. చంద్రబాబు మోసాలపై ఇంటింటికి వెళ్లి గిరిజను లకు జెడ్పీటీసీ, నాయకులు వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థు లను గెలిపించాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి, పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, నాయ కులు పోతురాజు , రామ్మూర్తి, గురుమూర్తి, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు. శిరగాం పం చాయతీ వైఎస్సార్‌సీపీ కమిటీ అధ్యక్షుడిగా జన్ని సోములు, ప్రధాన కార్యదర్శులుగా బాబూరావు, రమేష్, అప్పన్న, బాలరాజుతో పాటు నలుగురు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అరకులోయటౌన్: మండలంలోని చొంపి పం చాయతీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి చం ద్రబాబు మోసాలను నాయకులు వివరించారు. మండల పార్టీ మండల ఉపాధ్యక్షుడు పల్టాసింగి విజయ్‌కుమార్, నాయకులు సుక్రయ్య, ఆనంద్, సింహాద్రి, శోభన్, రవి పాల్గొన్నారు. చొంపి పం చాయతీ వైఎస్సార్‌సీపీ కమిటీ అధ్యక్షుడిగా బోయి పండు, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.రమేష్, కొర్రా రామ్ నాయుడు, కొడంగి గాసి, కమిడి ప్రవీణ్‌తో పాటు మరో నలుగురు కార్యదర్శులను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు.

పాడేరు రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదే శాల మేరకు మండలంలోని జి.ముంచంగిపుట్టు పంచాయతీ జల్లిపల్లి తదతర గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్య క్షుడు సీదరి రాంబాబు, నాయకులతో కలిసి ఇం టింటికీ వెళ్లి చంద్రబాబు అరాచక పాలన, ప్రజ లకు చేస్తున్న మోసాలను వివరించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నట్టేట ముంచారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనం తరం పార్టీ కమిటీ ఎన్నికలో అధ్యక్షుడిగా మజ్జి కొండబాబు, ఏకగ్రీవంగా ఎన్నికై నట్టు తెలిపారు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బసవన్నదొర, ఎంపీ టీసీ సభ్యుడు సన్యాసిరావు, సర్పంచ్ నీలకంఠం, నాయకులు మోహనరావు, బొంజుబాబు, సూర్యప్రకాష్, భీంబాబు, రమేష్, సుమాన్, ఈశ్వ రమ్మ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని గూడ పంచాయతీ గొచ్చరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగం గా మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బత్తిరి రవిప్రసాద్ తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అబద్ధపు హామీలను స్థానికులకు వివరించారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనను వివరించారు. వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, ఎంపీటీసీ సభ్యుడు కిలగడ సింహాచ లం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకట్, నాయ కులు కోటిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



గొచ్చరిలో కరపత్రాలను అందజేస్తున్న పార్టీ నాయకులు



జల్లిపల్లిలో స్థానికులకు కూటమి ప్రభుత్వం మోసాలను వివరిస్తున్న పార్టీ నేతలు

గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ గోపాలకృష్ణ

చింతూరు: సొమ్ములకు ఆశపడి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుం టామని చింతూరు సీఐ గోపాలకృష్ణ హెచ్చరిం చారు. స్థానిక పోలీసుస్టేషన్లో ఎస్‌ఐ రమేష్‌తో కలసి సోమవారం చింతూరు మండలంలోని ఆటో డ్రైవ ర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సంద ర్భగా సీఐ మాట్లాడుతూ గంజాయి రవాణా చేయ డం, సేవించడం, దాచి ఉంచడం, గంజాయి వ్యాపారులకు పైలట్‌గా వ్యవహరిస్తూ సహకరిం చడం తీవ్ర నేరంగా పరిగణిస్తామన్నారు. గం జాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు దూరం గా ఉండాలని, వాహనాలకు సంబంధించి అన్నిర కాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సీఐ సూచించారు. వాహనాలను ఓవర్‌స్పీడ్‌గా నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం



గొడుగులపుట్టులో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి



రాయిమామిడిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బొంజుబాబు తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పం చాయతీ గొడుగులపుట్టు గ్రామంలో రోడ్డు పనులను సర్పంచ్ వెంగడ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి సుబ్బలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ ఈ సం దర్భంగా సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ సరైన రహదారి లేక గొడుగులపుట్టు గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారికి ప్రత్యేక నిధులు కేటాయిండం జరిగిందన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర చొరవ తీసుకోవడంతో నేడు రోడ్డు సమస్య తీరిందన్నారు. అసంపూర్తి రహదారితో అవస్థలు పడ్డ గ్రామస్తులకు రోడ్డు అందుబాటులో రావడంతో హర్షం వ్యక్తం చేశారు. పెదగూడ సర్పం చ్ బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు గణపతి, ఉప సర్పంచ్ రుక్మిణి, వైఎస్సార్‌సీపీ నేతలు రాధాకృష్ణ, కృష్ణపతి, లక్ష్మణ్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ రాయిమామిడి గ్రామంలో జెడ్పీటీసీ నిధులు రూ.5 లక్షలతో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్టు జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు తెలిపారు. రాయిమామిడి గ్రామంలో సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. దశల వారీగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. స్థాని కులు హర్షం వ్యక్తం చేశారు. గోమంగి సర్పంచ్ కొర్ర జెట్టో, వైఎస్సార్‌సీపీ నాయకులు కొర్ర సత్తిబాబు, భాస్కర్‌రావు, వార్డు సభ్యులు శ్రీకన్య, నాయకులు విజయకుమార్, మోహన్‌రావు, సుబ్బారావు, ధనుం జయ్ , పృధ్వీరాజ్, గ్రామ పెద్దలు సోమన్న, అప్ప లనాయుడు, నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి పర్యటన.. ఫొటోలకే పరిమితం

- సెల్ఫీలు తీసుకొని వెళ్లిపోయిన మంత్రి
- డీపోను సందర్శించని వైనం



రోడ్డుపై కార్యకర్తలతో ఫొటోలు దిగుతున్న మంత్రి మనోహర్



తల్లిబిడ్డ అంబులెన్స్‌లో వచ్చిన భద్రత సిబ్బంది

డుంబ్రిగుడ: జిల్లా పర్యటనలో భాగంగా కించుమండ డీఆర్ డిపోను మంత్రి మనోహర్ సందర్శించి స్టాక్ తనిఖీలతో పాటు సరకులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంది. అయితే సోమవారం సాయంత్రం ఇక్కడకు విచ్చేసిన ఆయన కార్యకర్తలతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకొని అరకులోయ పయనమయ్యారు.నా యకులు ఎవరితోనూ మాటామంతీ లేకుండా వెళ్లిపో యారు. దీంతో కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహ పడ్డారు. సైడ్‌లైట్స్... మంత్రి మనోహర్ పర్యటించే కించుమం డ డిపో పరిసరాలు శుభ్రం చేయలేదు. దుర్గంధంతో కార్యకర్తలు ముక్కుమూసుకున్నారు. జనసేన కార్యక ర్తలు, టీడీపీ నాయకులు వేర్వేరుగా గ్రూపులుగా వేచి ఉన్నారు. పోలీ సులకు వాహనం ఏర్పా టు చేయక పోవడంతో తల్లీబిడ్డ అంబులెన్స్‌లో వచ్చారు.



డిపో వద్ద అధ్వానంగా ఉన్న పరిసరాలు